# తొలివెలుగు

జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 180 | గురువారం | 16-7-2026



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08


## ఎస్ఐఆర్ గడువు పెంపు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఆగస్టు మూడు వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించింది.ఆగస్టు 3న సర్వే పూర్తి కాగానే ఓటరు డ్రాఫ్ట్ జాబితా ఆగస్టు 10న ప్రచురించనున్నట్లు అని తెలిపింది. అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకూ గడువుగా పేర్కొంది.




2లో

### గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు..

## ఇప్పుడు జగన్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం

- ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో లోకేశ్ సమావేశం
- జగన్ రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ అని వ్యాఖ్యలు
- బ్రాహ్మణి స్టీల్స్, ఓబులాపురం దోపిడీతోనే సాక్షి మీడియా ఏర్పాటు అని ఆరోపణ
- వాళ్లు ఫ్యాక్షన్ తెస్తే.. మేం ఫ్యాక్టరీలు తెచ్చి ఉద్యోగాలిస్తున్నాం అని వెల్లడి
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ఉద్ఘాటన





# ప్రభుత్వ బడుల్లో ప్రపంచ భాషలు

- విదేశీ విద్యా వ్యవస్థలపై ఉపాధ్యాయులతో అధ్యయనం
- దేశ, రాష్ట్ర భవిష్యత్ తరగతి గదిలోనే ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది
- ఆగస్టు 15లోగా విద్యార్థులందరికీ 9 రకాల వస్తువులతో ఎడ్యుకేషన్ కిట్
- కొత్తకోటలో బాలికల స్కూల్ భవనం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- విద్యార్థినులతో సీఎం ముఖాముఖి
- 90 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు సాధిస్తామని వెల్లడి
- మహబూబ్‌నగర్‌లో అమర రాజా తయారీ యూనిట్‌ను ప్రారంభించిన రేవంత్
- పరిశ్రమల్లో స్థానికులకే అత్యధిక ఉద్యోగాలు ఇవ్వాలని సూచన

మహబూబ్‌నగర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జర్మనీ, జపాన్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల భాషలను నేర్పించేలా మార్పులు తీసుకురావాల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశ, రాష్ట్ర భవిష్యత్ తరగతి గదిలోనే ఉంటుందని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మెరుగైన విద్యావ్యవస్థ

- మిగతా 2వ పేజీలో

## 76 సార్లు ఢిల్లీ వచ్చారు.. 76 పైసలైనా తెచ్చారా?

- సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి రక్తం చల్లాలి అంటూ వ్యాఖ్యలు చేస్తారా?
- మా ఓటమికి కారణం మా పొరపాట్లే.. సరిదిద్దుకుంటున్నాం..
- ప్రజలకు ఇప్పుడు ఎవరేంటి అన్నది అర్థమవుతోంది..
- వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా..



2లో

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ

- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి
- మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ



2లో

# అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు



- స్వయంగా పాడె మోసి ఘన నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ అధినేత
- అంత్యక్రియలు పూర్తయ్యే వరకు కిర్లంపూడిలోనే..
- కుటుంబాన్ని పరామర్శించి.. అండగా ఉంటామని భరోసా
- ప్రజలు, అభిమానులు, పార్టీ నేతలతో కిక్కిరిసిన కిర్లంపూడి..
- ముద్రగడ అభీష్టం మేరకే అంతిమ సంస్కారాలు
- ప్రభుత్వ లాంఛనాలను తిరస్కరించిన కుటుంబ సభ్యులు.. కుమార్తె క్రాంతిని అడ్డుకున్న అనుచరులు

కిర్లంపూడి: కాపు ఉద్యమ నేత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం అంతిమ యాత్ర అభిమానులు, పార్టీ నాయకులు, శ్రేణులు, కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య సాగింది. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి గ్రామంలోని ఆయన ఇంటి ఆవరణలో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. శ్వాసకోశ వ్యాధితో హైదరాబాద్‌లోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముద్రగడ మంగళవారం సాయంత్రం కన్నుమూసిన సంగతి తెల్సిందే. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి బుధవారం ఉదయం స్వగ్రామమైన కిర్లంపూడికి తీసుకొచ్చారు. ముద్రగడ భౌతికకాయాన్ని

- మిగతా 2వ పేజీలో



2లో

## నేడే పూరీ జగన్నాథ్ రథయాత్ర

పూరీ: ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ రథయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జగన్నాథుడు తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి గర్భాలయం నుంచి బయటకు వచ్చి, మూడు రథాలను అధిరోహించి, భక్తులకు దర్శనం ఇవ్వబోతున్నారు.

### ఎవరూ అధైర్య పడొద్దు..

## వచ్చేది మళ్లీ మనందరి ప్రభుత్వమే

- చంద్రబాబు సిండికేట్ దోపిడీని కూకటివేళ్లతో పెకిలించేస్తాం
- నాలుగు నెలల్లో ఆక్వా ఫీడ్ రేట్లు కిలోకు రూ.14-16 పెంచారు
- పెంచింది రూ.16.. తగ్గించేది మాత్రం రెండు రూపాయలా?
- ఇలాగైతే ఆక్వా రైతులు ఏ రకంగా బతుకుతారు?
- మరోపక్క సిండికేట్‌గా ఏర్పడి ఉత్పత్తి ఖర్చులు పెంచుతున్నారు
- తీరా పంట చేతికొచ్చాక మళ్లీ సిండికేట్‌గా మారి రేట్లు తగ్గిస్తున్నారు



2లో



# అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

- సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అమరావతి నిర్మాణం
- అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్‌పై సీఎం సమీక్ష
- ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ స్థాయి నగరం ప్రణాళికపై సింగపూర్ ప్రతినిధుల ప్రజెంటేషన్

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని

- మిగతా 2వ పేజీలో




# నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం: సీఐ శంకర్ గౌడ్

- రాజాపేటలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**తొలివెలుగు, రాజాపేట :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం రాజాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్.ఐ లింగా రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు రోడ్డు నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్లు మాట్లాడటం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలు ఎంతో విలువైనవని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని కోరారు. సురక్షితంగా ప్రయాణించడంతో పాటు ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.

# పవర్‌లూమ్ సంఘ పాలకవర్గానికి ఘన సన్మానం

- చేనేత శాలువాలతో సత్కరించిన పద్మశాలి సంఘం



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో బుధవారం శ్రీనివాస పవర్‌లూమ్ సహకార సంఘం నూతన పాలకవర్గానికి స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల జరిగిన పవర్‌లూమ్ సొసైటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిన్న వెంకటరమణ చేనేత శాలువాలు కప్పి అభినందించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ఆడేపు రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా ఆడేపు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా సకినాల శ్రీనివాసులు, కోశాధికారిగా పొట్టబతిని నరహరి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గొట్టిపాముల సాయి కృష్ణ, సకినాల ఉపేందర్, ఆడెపు రమాదేవి, పొట్టబతిని నరేందర్, కర్నాటి వరలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆడేపు రామకృష్ణయ్య మాట్లాడుతూ.. పవర్‌లూమ్ సంఘ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. సంఘంలోని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం డైరెక్టర్లు బల్ల కృష్ణ, గర్దాసు శ్రీశైలం, చుంచు నారాయణ, పొట్టబతిని వెంకటేశం, నాయకులు ఆడేపు గణేష్, ఎక్కల దేవి లక్ష్మయ్య, ఆడెపు పాండరి తదితరులు పాల్గొని నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీగిరి క్షేత్రంలో జగన్నాథ రథోత్సవం

- ఆషాఢ పంచమి పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, పూజలు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం రేణిగుంట రెవెన్యూ పరిధిలోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 18న (శనివారం) ఆషాఢ మాస పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగన్నాథ-బలభద్ర రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రథోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిర్వాహకుల వివరాల ప్రకారం, ఉదయం 9 గంటల నుంచి వరాహ స్వామి హోమం, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి హోమం, శ్రీ సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు జగన్నాథ-బలభద్ర రథోత్సవం ప్రారంభమవుతుంది. రథోత్సవం అనంతరం ఆలయానికి విచ్చేసే భక్తులకు నిరంతర అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆషాఢ పంచమి మహోత్సవాలను పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దేవాలయ ట్రస్ట్ నిర్వాహకులు సూదిరెడ్డి నాగిరెడ్డి-కళావతి, కుంభాల ఎల్లారెడ్డి-శోభారాణి, కూర బద్రీనాథ్-కళ్యాణి, సమ్మెట రాఘవేంద్ర-మంజుల, వట్టం శ్రీనివాస్-రాజేశ్వరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటలతోనే రైతులకు లాభం: పీఏసీఎస్ చైర్మన్ మహేందర్ గౌడ్

- రేణికుంటలో రాయితీపై కంది విత్తనాలు, యూరియా పంపిణీ



**తొలివెలుగు, రాజాపేట:** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తే మెరుగైన దిగుబడులు, ఆర్థిక లాభాలు పొందవచ్చని రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం రేణికుంట పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న కంది విత్తనాలను యాదగిరిగుట్ట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు (ఏడీఏ) పద్మజ, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం యాప్ ద్వారా ముందస్తుగా యూరియా బుక్ చేసుకున్న రైతులకు చైర్మన్ సమక్షంలో యూరియా బస్తాలను పంపిణీ చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ప్రోత్సాహక చర్యలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమం అనంతరం పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను వ్యవసాయ శాఖ అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, డీసీసీ కార్యదర్శి ఇంజ నరేష్, రాజాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్, పీఏసీఎస్ కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్, వ్యవసాయ శాఖ ఏఈఓలు అంజయ్య, ప్రణీత, వినీత, భవ్యత, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బడుగుల జోలికొస్తే తరిమికొడతాం: తలసాని శ్రీనివాస్ యాదవ్

- ఈశ్వరమ్మ ఒంటరిది కాదు.. వెనుక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఉన్నారు
- అగ్రకుల అహంకారంతో మాట్లాడితే సహించేది లేదు
- యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలికి మాజీ మంత్రి పరామర్శ



**తొలివెలుగు,ఎల్బీనగర్ :** బడుగు బలహీన వర్గాల జోలికి వస్తే సహించేది లేదని, అహంకారంతో ప్రవర్తిస్తే తరిమికొడతామని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డిని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్‌పై ఇటీవల శివ చరణ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడిన ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎల్బీనగర్ చింతలకుంటలోని ఈశ్వరమ్మ నివాసానికి వెళ్లిన తలసాని.. ఆమెను పరామర్శించి సంపూర్ణ సంఘీభావం తెలిపారు.

**ఇంటి ముట్టడికైనా వెనకాడం!**

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తూ, ఎంతో మంది మన్ననలు పొందిన నానమ్మ వయసున్న ఈశ్వరమ్మపై అసభ్య పదజాలం ఉపయోగించడం కాంగ్రెస్ నేతల అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. "ఈశ్వరమ్మ ఒంటరిది కాదు.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ ఆమె వెంటే ఉన్నాయి" అని స్పష్టం చేశారు. అగ్రకుల అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని, బడుగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే సదరు నాయకుడి ఇళ్లను ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్, అఖిల భారత యాదవ సంఘం జాతీయ అధ్యక్షుడు రవీంద్ర కుమార్ యాదవ్‌లతో పాటు పలు బీసీ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈశ్వరమ్మకు మద్దతు తెలిపారు.

# నియమాలు పాటిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం




- చిన్నకొండూరు జడ్పీహెచ్ఎస్‌లో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు
- మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులదే బాధ్యత: ట్రాఫిక్ సీఐ ఎన్. వెంకటేష్

**తొలివెలుగు, చౌటుప్పల్ రూరల్ :** రోడ్డు భద్రత అనేది కేవలం ట్రాఫిక్ నిబంధనలకే పరిమితం కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ ఎన్. వెంకటేష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షంష్ యాదవ్ ఆదేశాలు, ట్రాఫిక్ డీఎస్పీ ఎం. ప్రభాకర్ రెడ్డి సూచనల మేరకు మంగళవారం చిన్నకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో శాంతిభద్రతల విభాగం పోలీసు అధికారులతో కలిసి విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో అధిక సంఖ్యలో యువత, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. వాహనదారుల నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. 18 సంవత్సరాల లోపు ఉన్న మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, అతివేగంగా నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అత్యవసర సేవల కోసం 112కు సమాచారం అందించాలని, గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తాము పాటించడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులు, గ్రామస్థుల్లో కూడా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం "నియమాలను పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం" అంటూ విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాంతిభద్రతల పోలీసు అధికారులు జీ. మన్మథ కుమార్, ఎస్ఐ కనకటి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## హామీలు నెరవేర్చకపోతే మరో ఉద్యమం తప్పదు!

- కమిటీల పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదు
- రాజాపేట మండల తెలంగాణ ఉద్యమకారుల సంఘం మాజీ అధ్యక్షుడు మారాజు కుమారస్వామి
- ఉపాధ్యక్షుడు వెంట సత్యనారాయణ

**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధమవుతామని రాజాపేట మండల తెలంగాణ ఉద్యమకారుల సంఘం మాజీ అధ్యక్షుడు మారాజు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు వెంట సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం రాజాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, ఎన్నికల హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ కాలయాపన చేయకుండా ఉద్యమకారుల గుర్తింపునకు సంబంధించిన విధివిధానాలను వెంటనే ప్రకటించాలని కోరారు. కోర్టుల ద్వారా వచ్చిన తీర్పుల అమలులో జాప్యం చేయకుండా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను కూడా ఉద్యమకారులుగా గుర్తించి, వారికి ప్రభుత్వం ప్రకటించిన అన్ని సంక్షేమ, గుర్తింపు ప్రయోజనాలను వర్తింపజేయాలని వారు కోరారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమాన్ని చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గంలో రాజపేటకు ప్రాధాన్యం

- సభ్యులుగా బి.శ్రీదేవి, జె.వెంకటలక్ష్మి, కాసోజు సంపత్ కుమార్ నియామకం
- ఇద్దరు మహిళలకు చోటు దక్కడంపై హర్షాతిరేకాలు

**తొలివెలుగు, రాజపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యవర్గంలో రాజపేట మండలానికి ఈసారి సముచిత స్థానం దక్కింది. మండలం నుంచి ఏకంగా ముగ్గురు నేతలను జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించారు. బి. శ్రీదేవి, జె. వెంకటలక్ష్మి, కాసోజు సంపత్ కుమార్‌లకు జిల్లా కార్యవర్గంలో చోటు కల్పిస్తూ పార్టీ జిల్లా నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి ముగ్గురికి, అందులోనూ ఇద్దరు మహిళలకు ఈ స్థాయి పదవులు లభించడం ఇదే తొలిసారి కావడంతో స్థానిక పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మహిళలకు పార్టీలో సమున్నత స్థానం, తగిన గుర్తింపు కల్పించడం గర్వకారణమని కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన వారికి స్థానిక నేతలు, కార్యకర్తలు ఫోన్ ద్వారా, సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) వేదికగా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు.

## హైదరాబాదులో కుమ్మర్ల తొలి బోనం జాతర విజయవంతం చేయాలి

- చిట్యాలలో జాతర కరపత్రం ఆవిష్కరణ
- కుటుంబ సమేతంగా పాల్గొనాలని పిలుపు

**తొలివెలుగు, చిట్యాల:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (టీఆర్‌కేఎస్) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులోని లోయర్ ట్యాంక్‌బండ్ ప్రాంతంలోని శ్రీశ్రీశ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయంలో నిర్వహించనున్న కుమ్మర్ల తొలి బోనం జాతరను ఘనవిజయం చేయాలని కోరుతూ చిట్యాలలో బుధవారం జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. చిట్యాల శ్రీ భవాని సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని జాతర విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా కుమ్మరుల ఐక్యత, సంప్రదాయ సంస్కృతి పరిరక్షణకు ప్రతీకగా ఈ తొలి బోనం జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుమ్మరుల ఆరాధ్య దైవమైన శ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారి సన్నిధిలో జరగనున్న ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి కుమ్మరులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ జాతర ద్వారా కుమ్మరుల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి కుమ్మర కుటుంబం ఈ కార్యక్రమాన్ని తమ సొంత పండుగగా భావించి కుటుంబ సమేతంగా హాజరై జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతరకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని ఘనవిజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల శ్రీ భవాని సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు, టీఆర్‌కేఎస్ నల్గొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాడూరు చంద్రం, సంఘం అధ్యక్షుడు ఆరూరి సత్తయ్య, సభ్యులు కంభంపాటి నరసింహ, బొడ్డుపల్లి చంద్రశేఖర్, కమ్మపాటి మల్లేష్, ఊట్కూరు బాలకృష్ణ, కుమ్మర సంఘం నాయకులు, యువకులు, పెద్దలు పాల్గొని జాతర విజయవంతానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.



# క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు




- గురువుల మార్గదర్శకత్వం విద్యార్థుల విజయానికి అవసరం
- మునిపంపుల ప్రభుత్వ బడిలో 700 నోటు పుస్తకాల పంపిణీ
- హైకోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్

**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ హైకోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్ అన్నారు. రామన్నపేట మండలం మునిపంపుల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తన తల్లిదండ్రులు మిర్యాల హరి గోవింద్ - జయలక్ష్మిల సౌజన్యంతో రవీందర్ విద్యార్థులకు 700 నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గురువు లేని విద్య గుడ్డి విద్య' అని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ బాగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జడ్చర్ల డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ గంజి సుకన్య పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ.. ఉత్తమ పౌరులుగా ఎదగడానికి విద్యే ప్రధాన మార్గమన్నారు. గ్రామానికి చెందిన వారు ఉన్నత స్థాయికి చేరుకుని, తిరిగి సొంత ఊరి పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి మాట్లాడుతూ.. బడి వికాసానికి మరికొంత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మిర్యాల రవీందర్ దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్ల క్రాంతి, ఏపీపీసీ చైర్మన్ బతిని వెంకటమ్మ, వార్డు సభ్యుడు యదాసు లక్ష్మణ్, సేవా భారతి సంస్థ చైర్మన్ మన్నే పద్మారెడ్డి, మాజీ సర్పంచ్ యదాసు యాదయ్య, మాజీ ఎంపీటీసీ గాదె పారిజాత, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పల్లివాడలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన




- సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- స్థలదాత ఖాజా బాబు కుటుంబానికి గ్రామస్థుల కృతజ్ఞతలు
- ఘనంగా నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమం

**తొలివెలుగు, రామన్నపేట :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రామన్నపేట మండలంలోని పల్లివాడ గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం బుధవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు, ఉపసర్పంచ్ పావురాల మచ్చగిరి, వార్డు సభ్యులు దండిగ పాండు, గట్టు ఉపేందర్‌లతో కలిసి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ఉదారంగా ముందుకు వచ్చి స్థలాన్ని అందించిన సయ్యద్ ఖాజా బాబును, వారి కుటుంబ సభ్యులను గ్రామ ప్రజలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కదారి సత్తయ్య, మాజీ ఉపసర్పంచ్ కల్లూరి నాగేష్, గ్రామ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు మంద చంద్రయ్య, అధ్యక్షుడు మల్లెపాక నరసింహ, సంఘం నాయకులు మేకల లచ్చయ్య, మేడి మల్లేశం, కర్రే స్వామి, కర్రే శ్రీనివాసు, మేకల లింగయ్య, జనపాల లక్ష్మణ్, సింగపంగ నరసింహ, జనపాల స్వామితో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయ పదవుల్లో ఎస్సీలకు ప్రాధాన్యత కల్పించాలి

- అధికార, ప్రతిపక్ష పార్టీల్లో దళితులకు వివక్ష తగదు
- జూలూరు పీఏసీఎస్ చైర్మన్ పదవి ఎస్సీలకే కేటాయించాలి
- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మండలంలో రాజకీయపరంగా ఎస్సీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా రాజకీయ పార్టీలు ముందుకు వెళ్తున్నాయని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య ఆరోపించారు. బుధవారం పురపాలక కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పదవుల కేటాయింపు విషయంలో ఎస్సీలను తీవ్ర వివక్షకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటివరకు అధికార పార్టీకి చెందిన మండల, పట్టణ శాఖల్లో దళితులకు ఎలాంటి ప్రాధాన్యత గల పదవులు ఇవ్వకుండా పక్కన పెట్టడం సరికాదన్నారు. రానున్న జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పదవిని తప్పనిసరిగా ఎస్సీలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుల ఓట్లతో రాజ్యాధికారాన్ని దక్కించుకుని, పదవుల పంపకాల్లో వారిని విస్మరించడం ఉభయ పార్టీల వైఖరికి అద్దం పడుతోందన్నారు. ఎస్సీలకు రాజకీయంగా తగిన న్యాయం కల్పించకపోతే, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వారి హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

## ఐటీ కంపెనీ భవనం పైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

శేరిలింగంపల్లి, జూలై 15: గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏండ్లుగా బెంగళూరులో ఉద్యోగం చేసి రెండు నెలల క్రితమే నగరంలోని ఐటీ కంపెనీలో చేరిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాను పనిచేస్తున్న ఐటీ కంపెనీ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాకు చెందిన తిరువీది వి.అవినాశ్(40)కు జ్యోతితో 2018లో వివాహమైంది. వివాహ అనంతరం భార్యాభర్తలు ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉండగా ఇద్దరు కుమారులు జన్మించారు.

అయితే అవినాశ్ ఉద్యోగం హైదరాబాద్‌కు మారడంతో రెండు నెలల క్రితమే నగరానికి వచ్చి కూకట్‌పల్లిలో నివాసముంటున్నారు. అవినాశ్ నాలెడ్జ్ సిటీలోని క్వాల్‌కామ్ భవనంలోని హెచ్‌సీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తాను ఇంటికి వస్తున్నట్లు భార్య జ్యోతికి మెసేజ్ చేసిన అవినాశ్ అనంతరం అందుబాటులో లేకుండా పోయాడు. అవినాశ్ వద్ద రెండు ఫోన్లు ఉండగా, ఓ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, మరో ఫోన్ ఎంతకూ లిఫ్ట్ చేయకపోవడంతో అతడి భార్య కార్యాలయ మేనేజర్‌కు ఫోన్ చేయగా 6 గంటలకే కంపెనీ నుంచి వెళ్లినట్లు తెలిపాడు. దీంతో జ్యోతి అమీర్‌పేటలో ఉండే తన సోదరుడు అరుణ్‌కుమార్‌కు సమాచారం అందించింది. వెంటనే అతడు రాత్రి 8:30 గంటల సమయంలో క్వాల్‌కామ్ భవనం వద్దకు వెళ్లాడు.



## గ్రామాభివృద్ధే ఏకైక లక్ష్యం: సర్పంచ్ ఆర్ల కావ్య

- ఆర్ఓ ప్లాంట్ నిర్వహణకు రూ.30 వేల గౌరవ వేతనం వితరణ
- సొంత డబ్బులతో నెలకు రూ.3 వేల కరెంటు బిల్లు చెల్లింపు
- జిబ్లాక్‌పల్లిలో 'హర్ ఘర్ జల్' అవగాహన సదస్సు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** గ్రామ ప్రజలందరికీ పరిశుభ్రమైన రక్షిత మంచినీరు అందించడమే కాకుండా, జిబ్లాక్‌పల్లిని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని గ్రామ సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని జిబ్లాక్‌పల్లి గ్రామంలో బుధవారం గ్రామీణ నీటి సరఫరా (ఆర్ డబ్ల్యూ ఎస్) శాఖ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ జల్', 'జల్ అప్నా దివాస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించే పథకంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ కావ్య మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామానికి ఉచితంగా ఆర్ఓ తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వాటర్ ప్లాంట్ మెయింటెనెన్స్ కోసం తన సొంత గౌరవ వేతనం రూ.30,000లను ప్లాంట్ నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేశారు. దీనికి అదనంగా ప్రతి నెల వచ్చే రూ.3,000ల కరెంటు బిల్లును కూడా తన సొంత నిధుల నుంచే చెల్లిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రానున్న రోజుల్లో అందరి సహకారంతో గ్రామాన్ని మరింత ప్రగతి పథంలో నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్ల లింగస్వామి, మాజీ ఎంపీటీసీ సురకంటి జంగారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వలమాల సత్యనారాయణ, నాయకులు సిర్పంగి గణేష్, మీసాల నరసింహ, మహిళా సంఘం అధ్యక్షురాలు తంగడపల్లి వసంతం పాల్గొన్నారు.

## కర్రలతో కొట్టి.. కత్తులతో పొడిచి..

సైబరాబాద్ పరిధిలో మరోసారి పాత కక్షలు పడగ విప్పుతున్నాయి. గత కొంతకాలంగా హత్యలు, అత్యాచారాలు వంటి నేరాలు పెరుగుతుండటంతో కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. ముఖ్యంగా పాత కక్షలతో జరుగుతున్న దారుణాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం రాత్రి మాదాపూర్ ఠాణా పరిధిలో జరిగిన యువకుడి హత్య స్థానికంగా తీవ్ర భయాందోళనకు గురిచేసింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన సెనేపల్లి భాస్కర్ (32) మాదాపూర్ ధ్రువ కాలేజ్ సమీపం లోని శ్రీశ్రీ సూట్స్(నోమా) హోటల్‌లో వర్కర్‌గా పనిచేస్తూ నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా భాస్కర్ హనుమకొండకు చెందిన రాజు కూతురిని గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. ప్రేమిస్తున్నానని వెంటపడటంతో యువతి కుటుంబసభ్యులు భాస్కర్‌ను మందలించడంతోపాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం యువతికి వివాహం చేశారు. అయినప్పటికీ భాస్కర్ సదరు యువతికి మెసేజ్‌లు పంపడం, ఫోను చేస్తుండటతో భర్త ఆ యువతికి విడాకులు ఇచ్చాడు. అంతటితో ఆగకుండా భాస్కర్ యువతి సోదరిని కూడా వేధించడం మొద లుపెట్టాడు. భాస్కర్ కారణంగా తన కూతురు కాపురం పాడైపోయిందని బాధపడుతున్న యువతి తండ్రి రాజు అతడిపై కక్ష పెంచుకున్నాడు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి: సర్పంచ్ టేకుల మంజులా రెడ్డి

- గ్రామంలో ఘనంగా 'హర్ ఘర్ జల్' సదస్సు, అవగాహన ర్యాలీ
- ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపు
- నూతన నల్లా కనెక్షన్ ప్రారంభం





**తొలివెలుగు, చౌటుప్పల్ రూరల్:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి కుటుంబం రక్షిత మంచినీటిని పొందడంతో పాటు, నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని గ్రామ సర్పంచ్ టేకుల మంజులా దిలీప్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పరిధిలోని గ్రామంలో బుధవారం 'హర్ ఘర్ జల్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూతన నల్లా కనెక్షన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు నిరంతరాయంగా నీరు అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. నీటిని వృధా చేస్తే భావితరాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చన్నారు.

**'మిషన్ భగీరథ' నీరే సురక్షితం:**

గ్రామస్థులు ఆర్ఓ ప్లాంట్ల నీటిని తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, కాబట్టి మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిని మాత్రమే కాచి, చల్లార్చి తాగాలని సర్పంచ్ సూచించారు. అనంతరం గ్రామంలో "జల సంరక్షణ – మన సంరక్షణ", "మంచినీటిని కాపాడుకుందాం – వృధా చేయొద్దు" అనే నినాదాలతో విద్యార్థులు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీటిని వృధా చేయబోమని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భోయిని లింగస్వామి, వార్డు సభ్యులు యంజాల లింగస్వామి, సామ సుమిత్ర, యంజాల శ్రీకాంత్, వల్లపు ప్రసన్న, యంజాల అమృత, భూతం లింగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశాల్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సుధీర్, అంగన్వాడీ కార్యకర్త అమృత, ఫీల్డ్ అసిస్టెంట్ స్వర్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.





# తంగడపల్లి పీహెచ్‌సీకి విద్యుత్ కల్పించి వెంటనే ప్రారంభించాలి

- భవనం ఉన్నా కరెంట్ లేక నిలిచిన సేవలు
- ప్రభుత్వ తీరుపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ఆగ్రహం
- ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన పార్టీ బృందం

**తొలివెలుగు, చౌటుప్పల్ రూరల్:** చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ నాయకులు ఈ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని, స్థానిక ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ భవనంలో అన్ని మౌలిక వసతులు ఉన్నప్పటికీ, కేవలం విద్యుత్ కనెక్షన్ లేకపోవడం వల్లే ప్రారంభానికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరెంట్ సౌకర్యం కల్పించడంతో పాటు, అవసరమైన వైద్య సిబ్బందిని, మౌలిక పరికరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే తంగడపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, గోశిక కరుణాకర్, బత్తుల దాసు, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, చికూరి ఈదయ్య, కనకయ్య, సిలువేరు జంగయ్య, రాములు, ఎండీ జావిద్, స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండ రహదారి దుస్థితిపై బీఆర్ఎస్ ఆందోళన





- రహదారి పొడవునా బైఠాయించిన పార్టీ శ్రేణులు, స్థానికులు
- ఎమ్మెల్యేకు పైరవీలపై ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యలపై లేదు
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. రహదారి మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన చేపట్టడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆందోళనలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేశారు. ఆందోళనకారులను ఉద్దేశించి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, చౌటుప్పల్ నుంచి భువనగిరికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సేవలకు వెళ్లే అంబులెన్స్‌లు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వలిగొండ రోడ్డులో ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి రహదారి విస్తరణ, మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఈ రహదారిని ఆధునికంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతిరోజూ ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధి తన రాజకీయ ప్రయోజనాలు, పైస్థాయి పైరవీలపైనే దృష్టి సారించారని విమర్శించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారి పరిస్థితిని వెంటనే సరిచేయాలని, లేదంటే ప్రజలతో కలిసి మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, వలిగొండ రహదారి సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ రహదారిలోని గుంతలు నీటితో నిండిపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని, వాహనాల రాకపోకలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి రహదారి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిరసన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపైనే బైఠాయించారు. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని వలిగొండ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.



# రజక కుటుంబాల సర్వే కరపత్రాల ఆవిష్కరణ

- కుల గణన, సమస్యల గుర్తింపునకే సర్వే
- చౌటుప్పల్‌లో రజక వృత్తిదారుల సంఘం సమావేశం
- హాజరైన మండల, మున్సిపల్ నాయకులు

**తొలివెలుగు, చౌటుప్పల్ రూరల్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రజక కుటుంబాల కుల గణన, వారి వృత్తి, ఎదుర్కొంటున్న సమస్యల పూర్తి వివరాలను తెలుసుకోవడానికి రాష్ట్ర రజక సంఘం ప్రత్యేక సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం చౌటుప్పల్ మండల, మున్సిపాలిటీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల కుటుంబ సర్వేకు సంబంధించిన అవగాహన కరపత్రాలను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు భారతరాజు యాదగిరి మాట్లాడుతూ.. రజక కుటుంబాల సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి రజక కుటుంబం ఈ సర్వేలో పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సామకూర యాదయ్య, గౌరవ అధ్యక్షులు కేతరాజు అంజయ్య, బొల్లారం లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులు మలిగ నర్సింహ, పెదకంటి లింగస్వామి, కొడుకులపల్లి సాలయ్య, మండల కోశాధికారి, మండల కార్యదర్శి కృష్ణ, శివ, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు బాదరాజు వెంకటేశం, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి కిడ్నాప్ కలకలం.. అర్ధరాత్రి వదిలేసిన దుండగులు

- హోలియా నుంచి వస్తుండగా కారులో వచ్చి అపహరణ
- సకాలంలో స్పందించిన పోలీసులు.. బైక్ గుర్తింపు
- నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు




**తొలివెలుగు, నిడమనూరు:** నిడమనూరు మండలంలో ఓ యువకుడిని గుర్తుతెలియని దుండగులు కారులో అపహరించిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూరు గ్రామానికి చెందిన బొల్లెపల్లి శేఖర్ (40) మంగళవారం రాత్రి పని నిమిత్తం హాలియాకు వెళ్లారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఆయన తిరిగి బైక్‌పై ఊట్కూరుకు వస్తుండగా, ఎక్కలూరు మైసమ్మ ఆలయం సమీప మార్గంలో కారులో వచ్చిన ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు శేఖర్‌ను బలవంతంగా కారులోకి లాక్కెళ్లారు.

**అర్ధరాత్రి వేళ వదిలివేత..**

కిడ్నాప్ జరుగుతున్న సమయంలోనే బాధితుడు శేఖర్ ఎలాగోలా '100' నంబర్‌కు ఫోన్ చేసి, తనను కొందరు అపహరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఘటన స్థలానికి చేరుకోగా, అక్కడ శేఖర్ ద్విచక్ర వాహనం లభ్యమైంది. పోలీసులు వెంటనే సీసీటీవీ ఫుటేజీలను, బాధితుడి సెల్‌ఫోన్ లొకేషన్‌ను తనిఖీ చేయడం ప్రారంభించారు. కాగా, బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో దుండగులు శేఖర్‌ను చెరువుగట్టు ఫ్లైఓవర్ సమీపంలో వదిలిపెట్టి పరారయ్యారు. అక్కడ స్థానికుల ఫోన్ సాయంతో శేఖర్ తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడి తండ్రి బొల్లెపల్లి రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిడమనూరు ఎస్ఐ విజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.






# రూ.6.7 లక్షల కోట్లు ఫట్..

**ఒక్కరోజే 25 శాతం పడిపోయిన ఐబీఎం షేర్ విలువ**

**58 ఏండ్లలో ఈ స్థాయి పతనం తొలిసారి**

న్యూఢిల్లీ/న్యూయార్క్, జూలై 15 : అమెరికాకు చెందిన బహుళజాతి టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్) షేర్లు కుప్పకూలాయి. మంగళవారం ఏకంగా 25 శాతం పడిపోయాయి. దీంతో ఈ ఒక్కరోజే సంస్థ మార్కెట్ విలువ 70 బిలియన్ డాలర్ల (రూ.6.7 లక్షల కోట్లు)దాకా ఆవిరైపోయింది. గడిచిన 58 ఏండ్లలో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికానికిగాను కంపెనీ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే ఈ భీకర నష్టాలకు కారణమని బ్లూంబర్గ్ నివేదిక చెప్తున్నది. 1911లో ప్రారంభమైన ఐబీఎం ఆదాయం.. జూన్‌తో ముగిసిన 3 నెలల్లో ఏమాత్రం అంచనాలను అందుకోకుండా కేవలం 1 శాతం పెరిగి 17.2 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఇది మదుపర్లను పెద్ద ఎత్తున అమ్మకాల దిశగా నడిపించిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'క్లయింట్ల ఆలోచనల్ని అంచనా వేయడంలో మేము తడబడ్డాం. మార్కెట్‌లో చోటుచేసుకున్న మార్పులపట్ల వేగంగా స్పందించలేకపోయాం' అంటూ ఐబీఎం చైర్మన్, సీఈవో అర్విండ్ కృష్ణ మదుపర్లకు రాసిన ఓ లేఖలో పేర్కొనడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. 'జూన్ నెలలో కొన్ని వారాలు.. క్లయింట్లు తమ త్రైమాసిక మూలధన వ్యయాన్ని సర్వర్లు, స్టోరేజీ, మెమరీ చిప్‌ల కొనుగోలుకు మళ్లించడాన్ని మేము గమనించాం. ధరలు పెరుగవచ్చన్న అంచనాల నడుమ ఈ కొనుగోలుకు దిగారు. అయితే ఈ పరిణామాన్ని మేము ఊహించలేకపోయాం. చివరకు అదే ఐబీఎం ఆదాయానికి గండి కొట్టింది' అని అన్నారు. ఈ క్రమంలో అర్విండ్ వ్యాఖ్యలు సైతం మదుపర్లలో మున్ముందు ఐబీఎం వ్యాపార కార్యకలాపాలపై ఆందోళనల్ని రేకెత్తించాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇన్వెస్టర్లు భారీగా కంపెనీ షేర్లలో లాభాల స్వీకరణకు పెద్దపీట వేశారని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. మొత్తానికి కృత్రిమ మేధ (ఏఐ)కు నానాటికీ ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఐబీఎం నష్టాలు.. ఇప్పుడు ఇతర టెక్ కంపెనీల ఫలితాలపైనా అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఐబీఎం షేర్ విలువ ప్రస్తుతం 220.80 డాలర్లుగా ఉన్నది.



# మళ్లీ గోల్డెన్ డేస్!

**ధరలు తగ్గడంతో జ్యువెలరీ షాపుల్లో సందడి**

**కస్టమ్స్ డ్యూటీ పెంపు ప్రభావం నుంచి కోలుకుంటున్న నగల మార్కెట్**

**పెళ్లిళ్లు, పండుగల సీజన్‌కు ముందే పెరుగుతున్న ఫుట్‌ఫాల్స్**

**లైట్ వెయిట్, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు అధిక డిమాండ్**

రికార్డు స్థాయికి పెరిగిన బంగారం ధరలు కొంతకాలంగా వినియోగదారులను కొనుగోళ్లకు దూరం ఉంచాయి. అయితే ఇటీవల ధరల మంట కొంతమేర చల్లబడడంతో దేశీయ జ్యువెలరీ మార్కెట్లో మళ్లీ కొనుగోళ్ల సందడి కనిపిస్తోంది. డాలర్ల వినియోగం కట్టడికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, కస్టమ్స్ డ్యూటీ కారణంగా కొన్నినెలలు మందగించిన జ్యువెలరీ డిమాండ్ ఇప్పుడు వేగంగా పుంజుకుంటోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ధరల తగ్గుదలతో పాటు, భారతీయ కుటుంబాల్లో ప్రతి శుభకార్యానికి బంగారానికి ఉన్న సాంస్కృతిక బంధం జ్యువెలరీ మార్కెట్‌ను మళ్లీ పరుగులు తీయిస్తోంది. బంగారం దిగుమతులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6--15 శాతానికి పెంచిన తర్వాత కొనుగోలుదారులు నగల షాపింగ్‌కు బ్రేకనిచ్చారు. వేచిచూసేధోరణి అవలంబించారు. ఇటీవల బంగారం భారీగానే తగ్గడంతో ప్రస్తుత ధరల వద్ద తిరిగి కొనుగోలు చేసేందుకు మార్కెట్లో అడుగుపెడుతున్నారని ప్రముఖ ఆభరణాల సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ ఏడాది ప్రారంభంలో 10 గ్రా. బంగారం ధర చారిత్రక గరిష్టస్థాయి రూ.1,85,000 తాకిన తర్వాత తిరిగి గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఒక్క జూన్ నెలలోనే బంగారం ధర 8% కన్నా తగ్గడం నగల ప్రియులకు ఊరటనిచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో జువెలరీ షాపులు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. బంగారం డిమాండ్ 70%కి పైగా పడిపోయినప్పటికీ ధరలు కొంత తగ్గిన తర్వాత పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, మార్కెట్‌లో ఫుట్‌ఫాల్స్ పెరగడం, నగల విక్రయాలు పుంజుకోవడం జ్యువెలరీ రంగానికి మళ్లీ మంచిరోజులొచ్చాయని బంగారం వర్తకులు భావిస్తున్నారు.కొన్ని నెలలుగా అమ్మకాలు తగ్గి వెలవెలబోయిన జ్యువెలరీ పరిశ్రమ ఇప్పుడు వచ్చే శ్రావణం, దసరా, దీపావళి, వివాహాల సీజన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. అధిక ధరల కారణంగా తక్కువ వెయిటేజ్, వన్ గ్రామ్ గోల్డ్ నగల వైపు మళ్లిన వినియోగదారులు మళ్లీ మేలిమి బంగారు నగలు, సంప్రదాయ ఆభరణాల కొనుగోలుకు ఉత్సాహం చూపుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. భారతదేశంలో బంగారం కొనడం కేవలం పెట్టుబడే కాదు, సంప్రదాయం కూడా. మార్కెట్ బలంగా కోలుకుంటోందని పరిశ్రమ ప్రతినిధులు పేర్కొంటున్నారు. రానున్న పండుగ సీజన్ ఆభరణాల మార్కెట్‌కు మళ్లీ బంగారు కాంతులు తెస్తుందని ఆశిస్తున్న రిటైలర్లు షాపుల విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేస్తున్నారు. టైటన్ కొత్తగా 77 స్టోర్లను, కల్యాణ్ జ్యువెలర్స్ 524 స్టోర్లకు నెట్‌వర్క్‌ను విస్తరించింది.



# ఇక సుంకాలు నిల్..

**అమల్లోకి భారత్-బ్రిటన్ వాణిజ్య ఒప్పందం**

**తెలంగాణ నుంచి యూకేకు సరుకు రవాణా మొదలు**

న్యూఢిలీ:భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) బుధవారం అమల్లోకి వచ్చింది. దీంతో బ్రిటన్‌కు భారత్ నుంచి జరుగుతున్న ఎగుమతుల్లో ఇకపై దాదాపు 99 శాతం వస్తూత్పత్తులకు సుంకాల నుంచి మినహాయింపు లేదా తక్కువ భారం పడనున్నది. అలాగే బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చే 90 శాతం వస్తూత్పత్తుల విషయంలోనూ ఇదే వర్తించనున్నది. కాగా, సీఈటీఏతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, సేవా రంగాలు బలోపేతమవడమేగాక, పెద్ద ఎత్తున వివిధ రంగాల్లో పెట్టుబడులకూ అవకాశాలుంటాయని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. ముఖ్యంగా ఆటోమోటివ్, తయారీ, కన్స్యూమర్ గూడ్స్, క్రియేటివ్ ఇండస్ట్రీస్, మెడికల్ టెక్నాలజీ రంగాలకు ప్రోత్సాహం లభిస్తుందని వాణిజ్య, వర్తక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. సీఈటీఏతో ఎగుమతి ఆధారిత పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆశాభావం వ్యక్తం చేశారు. సనత్‌నగర్‌లోని ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో (ఐసీడీ) కార్యాలయంలో తెలంగాణ నుంచి యూకేకు వెళ్లే ఎగుమతి కంటైనర్లను అధికారికంగా ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రెండు దేశాల ఆర్థిక సంబంధాల్లో ఈ ఒప్పందాన్ని ఓ మైలురాయిగా అభివర్ణించారు. ఇది భారతీయ ఎగుమతిదారులకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ఉత్పత్తులపై పన్నులు తగ్గడంతో రాష్ట్రం నుంచి జరిగే ఎగుమతుల పోటీతత్వం పెరుగుతుందని కూడా అన్నారు. భారత్-యూకే సీఈటీఏ ఒప్పందం.. విస్తృత శ్రేణి ఉత్పత్తులకు పన్ను రాయితీలను కల్పిస్తుందని విదేశీ వాణిజ్య విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ డా సంపత్ కుమార్ అన్నారు. ప్రధానంగా బ్రిటన్ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల అమ్మకాలకు, వాటి ఎగుమతులకు అవకాశాలను గణనీయంగా పెంచగలదని చెప్పారు. అలాగే విశాఖపట్నం సెజ్ డిప్యూటీ కమిషనర్ భవానీ శ్రీ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో లభించే ప్రయోజనాలు చిన్న పరిశ్రమలకు పెద్దగా అందుతాయని పేర్కొన్నారు. ఫార్మా, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో తెలంగాణ ఇప్పటికే బలంగా ఉన్నందున.. ఈ ఒప్పందం ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరింత ముందంజలో నిలువగలదన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. అపెడా తెలంగాణ, ఏపీ ప్రాంతీయ అధిపతి ఆర్పీ నాయుడు మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, పాల ఉత్పత్తులు, మిఠాయిలు, చిరుధాన్యాలు సహా అపెడా పరిధిలోని ఉత్పత్తుల ఎగుమతులకు ఈ ఒప్పందం గొప్ప అవకాశాలను అందిస్తుందని వివరించారు. యూకే హై కమిషనర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ సిద్ధార్థ్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. భారత్-యూకే సీఈటీఏను ఒక చారిత్రాత్మక ఒప్పందంగా అభివర్ణించారు. మెరుగైన మార్కెట్ ప్రవేశం, సులువైన డాక్యుమెంటేషన్ ద్వారా ఇది వాణిజ్యాన్ని సులభతరం చేస్తుందని, తద్వారా ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ ఐసీడీ అసిస్టెంట్ కస్టమ్స్ కమిషనర్ వంశీధర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లాభాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై, జూలై 15 : దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ షేర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాతో ఫెడరల్ రిజర్వు దూకుడుతో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటం మదుపర్లలో విశ్వాసాన్ని పెంచింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 130.49 పాయింట్లు లాభపడి 77,185.43 వద్ద స్థిరపడింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 26.45 పాయింట్లు అందుకొని 24,078.50 వద్ద ముగిసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం విశేషం. ఈ సూచీల్లో ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ముగియగా..పవర్ గ్రిడ్, ఎల్ అండ్ టీ, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయని, ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో చివర్లో కోలుకున్నాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

